GSTIN-NO:36FKPSI308PIZX

epaper:tmedia.net.in

# టి-మీడియా

T MEDIA

సామాజికం... ప్రజల పక్షం


మెయిన్ : మంగళవారం- జనవరి 30-2024 పేజీలు : 3

## ఘోర రోడ్డు ప్రమాదం...ఆరుగురు మృతి



**టీ మీడియా, జనవరి 29, మిర్యాల గూడ:**

నల్గొండ జిల్లా మిర్యాల గూడలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. అద్దంకి-నార్కట్‌పల్లి ప్రధాన రహదారిపై ఆదివారం అర్ధరాత్రి ఈ ప్రమాదం జరిగింది. గుర్తుతెలియని లారీ కారును వెనుక నుంచి ఢీకొట్టడంతో అందులప్రయాణిస్తున్న అయిదుగురు మృతి చెందారు. మృతుల్లో ఇద్దరు చిన్నారులు కూడా ఉన్నారు. మరో మహిళ తీవ్రంగా గాయపడగా ఆసుపత్రికి తరలించారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడలోని నందిపాడు కాలనీకి చెందిన చెరుపల్లి మహేశ్ (32) హైదరాబాద్‌లోని వనస్థలిపురంలో ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి కారులో ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, ఇతర ప్రాంతాలకు దైవదర్శనానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో మిర్యాలగూడలోని నందిపాడు కాలనీకి వస్తుండగా.. అద్దంకి-నార్కట్‌పల్లి ప్రధాన రహదారిపై ఓ లారీ వెనుక నుంచి కారును ఢీకొట్టింది. ఈ ఘటనలో మహేష్ భార్య జ్యోతి (30), కుమార్తె రిషిత (6), మహేశ్ తోడల్లుడు, యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం గొల్నెపల్లికి చెందిన భూమా మహేందర్ (32), ఆయన కుమారుడు లియాన్సీ (2) అక్కడికక్కడే మృతి చెందారు. మహేందర్ భార్య భూమా మాధవి తీవ్రంగా గాయపడ్డారు. ఆమెకు మిర్యాలగూడ ప్రాంతీయ ఆసుపత్రిలో అత్యవసర చికిత్స అందించి తరువాత ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణచేపట్టారు.



## మీతో మీరే పోటీపడండి : ప్రధాని మోడీ

**టీ మీడియా, జనవరి 29, న్యూఢిల్లీ :**

విద్యార్థులు ఇతరులను పోటీగా భావించకుండా .. తమకు తామే పోటీగా భావించాలని ప్రధాని మోడీ పేర్కొన్నారు. అలాగే మీ పిల్లల రిపోర్టు కార్డులను మీ విజిటింగ్ కార్డుల్లా పరిగణించవద్దని ప్రధాని మోడీ తల్లిదండ్రులకు సూచించారు. సోమవారం 'పరీక్షా పే చర్చ' ఏడో ఎడిషన్ సందర్భంగా ప్రధాని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. విద్యార్థులే భారతదేశ భవిష్యత్తు రూపకర్తలుగా అభివర్ణించారు. విద్యార్థుల్లో సృజనాత్మకత విస్తృతమవుతుండడంతో .. ఈ కార్యక్రమం తనకు కూడా పరీక్షలాగా మారిందని అన్నారు. పోటీ, సవాళ్లు జీవితంలో స్ఫూర్తినిస్తాయని.. అయితే పోటీ ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. మీ పిల్లలను మరొకరితో పోల్చకూడదని, అది వారి భవిష్యత్తుకు హాని కలిగించవచ్చని అన్నారు. కొందరు తమ పిల్లల రిపోర్ట్ కార్డులను విజిటింగ్ కార్డుగా పరిగణిస్తారని, ఇది మంచిది కాదని అన్నారు. విద్యార్థులపై పరీక్షల ఒత్తిడి మూడు రకాలుగా ఉంటుందని ప్రధాని వివరించారు. సహ విద్యార్థులు, తల్లిదండ్రుల నుండి ఎదురైతే.. ఒక్కోసారి పిల్లలు తాము రాణించలేకపోతున్నామని ఒత్తిడిగా ఫీలవుతారని అన్నారు. ఒత్తిడిని అధిగమించేందుకు ప్రిపరేషన్ సమయంలో చిన్నచిన్న లక్ష్యాలను ఏర్పరుచుకుని, క్రమంగా మీ పనితీరును మెరుగుపరుచుకోవాలని, దీంతో మీరు పరీక్షలకు సిద్ధమవ్వచ్చని అన్నారు. గత కొన్నేళ్లుగా ప్రధాని ఈ 'పరీక్షా పే చర్చ' కార్యక్రమం నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. కరోనా కారణంగా నాలుగో ఎడిషన్‌ను ఆన్‌లైన్‌లో నిర్వహించారు. ఈ ఏడాది భారత మండపంలో టౌన్‌హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి 2.26 కోట్ల మంది నమోదు చేసుకున్నారు. ప్రతి రాష్ట్రం, కేంద్రపాలిత ప్రాంతం నుండి ఇద్దరు విద్యార్థులు, ఒక ఉపాధ్యాయురాలితో పాటు కళా ఉత్సవ్ విజేతలు హాజరయ్యారు.

# అందరికీ డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ కార్డు

- ఆరోగ్య శ్రీ బిల్లుల చెల్లింపులు వేగవంతం
- బీబీ నగర్ ఎయిమ్స్ పూర్తి సేవలందించేలా దృష్టి
- వైద్య ఆరోగ్య శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి



**టి మీడియా, జనవరి 29, హైద్రాబాద్ బ్యూరో :**

రాష్ట్రంలో ప్రతి ఒక్కరికి డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి ఆదేశించారు. అందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ కార్డును ఒక యూనిక్ నంబర్ తో అనుసంధానం చేయాలని సూచించారు. దీంతో అత్యవసర పరిస్థితుల్లో సరైన వైద్యం అందించే వీలుంటుందని అన్నారు. ఈ హెల్త్ ప్రొఫైల్ కార్డుతో ఆరోగ్యశ్రీ ని అనుసంధానం చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. ఆరోగ్యశ్రీకి తెల్ల రేషన్ కార్డు తప్పనిసరి అనే నిబంధన సడలించే అంశాన్ని పరిశీలించాలని సీఎం అధికారులతో చర్చించారు. ఈ నిబంధన కారణంగా ఆరోగ్యశ్రీ కార్డు కోసం తెల్ల రేషన్ కార్డు తీసుకునే వారి సంఖ్య పెరుగుతోందని అన్నారు. మెడికల్ కాలేజీ ఉన్న ప్రతీ చోట నర్సింగ్, ఫీజియోథెరపీ, పారా మెడికల్ కాలేజీలు ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఇందుకోసం కామన్ పాలసీని తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. డా. బి. ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో వైద్య, ఆరోగ్య శాఖపై ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ దామోదర రాజ నర్సింహ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీమతి శాంతి కుమారి, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీ శేషాద్రి, సీఎం జాయింట్ సెక్రటరీ శ్రీమతి సంగీత సత్యనారాయణ, హెల్త్ సెక్రటరీ శ్రీమతి క్రిస్టినా చోంగ్తు, కమిషనర్ శ్రీ కర్ణన్, డ్రగ్ కంట్రోల్ డైరెక్టర్ జనరల్ శ్రీ కమలహాసన్ రెడ్డి, సీఈఓ ఆరోగ్యశ్రీ శ్రీమతి విచలక్ష్మి, తదితర అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. వరంగల్, ఎల్బీ నగర్, సనత్ నగర్, అల్వాల్ లో టిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. వైద్యుల కొరత లేకుండా మెడికల్ కాలేజీలను ఆసుపత్రులకు అనుసంధానంగా ఉండేలా చూడాలని అన్నారు. రాష్ట్రంలో మెడికల్, నర్సింగ్, పారా మెడికల్ కాలేజీల్లో ఇంకా ప్రారంభం కాని వాటి వివరాలను సీఎం అడిగి తెలుసుకున్నారు. కొడంగల్ లో మెడికల్ కాలేజీ, నర్సింగ్ కాలేజీ ఏర్పాటు చేసేందుకు పరిశీలన జరపాలని అధికారులకు సూచించారు. బీబీనగర్ ఎయిమ్స్ లో పూర్తిస్థాయి వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని సీఎం అన్నారు. ఎయిమ్స్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే ఖమ్మం, వరంగల్, నల్లగొండ జిల్లాల ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. దీంతో ఉస్మానియా, నిమ్స్ ఆసుపత్రులపై భారం తగ్గుతుం దన్నారు. ఎయిమ్స్ ను సందర్శించి పూర్తిస్థాయి రిపోర్టు తయారు చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఎయిమ్స్ లో పూర్తిస్థాయి వైద్య సేవల కోసం అవసరమైతే తానే స్వయంగా కేంద్రమంత్రిని కలిసి వివరిస్తానని సీఎం అన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల ప్రజలు వైద్యం కోసం కేవలం హైదరాబాద్ పైనే

మిగతా 3లో...



## బీహార్‌లోకి ప్రవేశించిన రాహుల్ గాంధీ భారత్ జోడో న్యాయ్ యాత్ర

**టి మీడియా, జనవరి 29,పాట్నా :**

కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేపడుతున్న భారత్ జోడో న్యాయ్ యాత్ర సోమవారం బీహార్‌లోకి ప్రవేశించింది. ఆర్‌జెడి, కాంగ్రెస్ కూటమికి ముగింపు పలికిన జెడియు అధ్యక్షుడు నితీష్‌కుమార్ బిజెపి గూటికి చేరిన సంగతి తెలిసిందే. ఆదివారం బిజెపి మద్దతుతో మరోసారి కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన మరుసటి రోజు రాహుల్ యాత్ర బీహార్‌కు చేరుకోవడంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ ఉదయం పశ్చిమబెంగాల్‌లోని సోనాపూర్ నుండి ప్రారంభమైన యాత్ర ఉదయం 11 గంటలకు బీహార్‌లోని కిషన్‌గంజ్ చేరుకుంది. ముస్లింలు అధికంగా ఉండే కిషన్‌గంజ్ లోక్‌సభ నియోజకవర్గంలో 2009 నుండి కాంగ్రెస్ విజయం సాధిస్తూవస్తోంది. భారీ ర్యాలీ అనంతరం ఈ రోజు సాయంత్రం నిర్వహించనున్న బహిరంగ సభలో రాహుల్ మాట్లాడనున్నారు. మంగళవారం పూర్నియాకు, మరుసటి రోజు కతిహార్‌లో యాత్ర చేపట్టనున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. అయితే ఈ రెండు నియోజకవర్గాలు జెడియు కంచుకోటలు కావడం గమనార్హం. దీంతో జెడియు ఎలా ప్రతిస్పందిస్తుందనే అంశంపై చర్చ నడుస్తోంది. 2020 అసెంబ్లీ ఎన్నికల అనంతరం రాహుల్ బీహార్‌లో పర్యటించడం ఇదే మొదటిసారి. 2020 ఎన్నికల తర్వాత ఎన్‌డిఎ, జెడియు నేతృత్వంలో నితీష్ కుమార్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. 2022 ఆగస్ట్‌లో ఎన్‌డిఎకి గుడ్‌బై చెప్పి.. ఆర్‌జెడి, కాంగ్రెస్ కూటమితో కలిసి తిరిగి అధికారం చేపట్టారు. రెండేళ్ల అనంతరం ఆదివారం తిరిగి ఎన్‌డిఎతో జతకట్టారు.

# అరాచకాన్ని అడ్డుకుందాం..రాష్ట్రాన్ని కాపాడుకుందాం

- టీడీపీ అధినేత చంద్రబాబు



**టీ మీడియా, జనవరి 29, రాజమండ్రి :**

రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోంది. ఒక సైకో, దుర్మార్గుడి నుంచి రాష్ట్ర ప్రజలను కాపాడుకోవాలంటే సైకిల్ ఎక్కి, గాజు గాసుతో ప్రజల వద్దకు వెళ్లి, వాస్తవాలను తెలపండి, రాష్ట్రంలో వైసీపీ ఖాళీ అవుతోంది, మనం గేట్లు ఎత్తితే అక్కడి ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు దూసుకు వస్తారు, రాష్ట్రంలో దళితులు, మహిళలు, బలహీన, బడుగువర్గాలపై దాడులు పెరిగాయి. ఈ స్థితిలో రాష్ట్ర ప్రజలను కాపాడుకోవాలంటే జనసేన, టీడీపీకి ఓటు వేయాలని టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారు. రాజమండ్రి రూరల్ మండలం కాతేరు గ్రామంలో సోమవారం జరిగిన 'రా.. కదలి రా' సభలో ప్రసంగించారు. మాచర్లలో ఓ మత్స్యకారుడిని పార్టీ మారాలని పోలీసులు వేధించారని, దీంతో ఆ టీడీపీ కార్యకర్త ఆత్మహత్య చేసుకున్నాడని, కేవలం మాచర్లలో మరో చిన్న సైకో వల్లే ఈ దుర్మార్గం జరిగిందని చంద్రబాబు ఆరోపించారు. ఓ ఉన్మాది, సైకో పాలనలో అంతా అరాచకం సాగుతోందన్నారు. అనంతపురంలో తనకు పెన్షన్ ఇప్పించాలని అభ్యర్థిస్తే అక్కడ మంత్రి అనుచరుడు తన కోరిక తీర్చాలని బలవంతం చేశాడని మండిపడ్డారు. అతడి మాట విననందుకు నడిరోడ్డుపై కాళ్లతో తన్నాడన్నారు. ఇక.. గుంటూరు జిల్లాలో తెలుగుదేశం నాయకుడు కన్నాలక్ష్మీనారాయణపై అక్కడి మరో సైకో రాంబాబు దాడి చేయించాడని మండిపడ్డారు. ఇలా రోజు రోజుకూ ఈ ఉన్మాదుల అరాచకాలు పెరిగిపోయాయని, అచ్చోసిన ఆంబోతుల్లా ఊరు మీద పడిన ఈ సైకోలకు తగిన బుద్ధి చెబుతామన్నారు. వడ్డీతో సహా చెల్లిస్తామని చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే 10 మంది మంత్రులు ఎన్నికల ముందే ఓడిపోయారని, వీరిలో తానేటి వనిత, చెల్లుబోయిన వేణుగోపాల్, జోగిరమేష్.. వీరందరూ ప్రజల ముందు ఓడినట్టే అన్నారు. మర్డర్లు చేసినోళ్లను, మద్దతు ఇచ్చినోళ్లకు సీట్లు ఇస్తున్నావా? నీ అవినీతిపై ఎన్నో ఆరోపణలు వచ్చాయని మరో ఎమ్మెల్యే సీఎం జగన్‌ని

మిగతా 3లో...

## కేటీఆర్ భాషను మార్చుకోవాలి..

- మండిపడ్డ మంత్రి కోమటిరెడ్డి



**టీ మీడియా, జనవరి 29,హైదరాబాద్ :**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కేసీఆర్ ఖాళీ గోటికి కూడా సరిపోడని ఎలా అంటావ్ అంటూ బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పై మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మండిపడ్డారు. మంత్రి కోమటిరెడ్డి సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం గూడూరులో నూతన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాలి గోటికి సరిపోని వాడే మిమ్మల్ని ఫామ్ హౌస్ లో పెట్టాడా..? అని విమర్శించారు. కేటీఆర్ తన భాషను మార్చుకోవాలని హితవు పలికాప్. కాలి గోటికి సరిపోని రేవంత్ రెడ్డి మిమ్మల్ని తొక్కితే ఒక్కొక్కరు 560000 ఓట్లతో ఓడిపోయారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ చేసేదే చెబుతాది మీలాగా పూటకు ఒక మాట చెప్పదని ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డి జెడ్పిటిసి నుంచి ఇండిపెండెంట్గా ఎమ్మెల్సీగా గెలిచి అంచలంచలుగా ఎదిగి ముఖ్యమంత్రి అయ్యాడని తెలిపారు. కేసీఆర్ యాదాద్రి నుంచి తన ఫామ్ హౌస్ కు పోతుంటే వాసాల స్మశానాలు అడ్డంగా ఉన్నావని గ్రామాన్ని దత్తత తీసుకొని వదిలేసాడని మండిపడ్డారు.



## రూ.5వేలకోట్లు దాటిన టీటీడీ వార్షిక బడ్జెట్

**టీ మీడియా, జనవరి 29, తిరుమల :**

తిరుమల తిరుపతి దేవస్థానం వార్షిక బడ్జెట్ రూ.5వేలకోట్లు దాటింది. రూ.5,141.74 కోట్ల అంచనాలతో 2024-25 వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టగా.. రూ.5,122.80 కోట్ల బడ్జెట్‌కు పాలకవర్గం ఆమోదించింది. ఇంజినీరింగ్ విభాగానికి రూ.350 కోట్లు, హిందూ ధర్మప్రచార, అనుబంధ ప్రాజెక్టులకు రూ.108.50 కోట్లు కేటాయించారు. వివిధ సంస్థలకు గ్రాంట్స్ రూపంలో రూ.113.50 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వానికి సహకారం రూపంలో రూ.50 కోట్లు, టీటీడీ విద్యాసంస్థలు, పలు వర్సిటీలకు గ్రాంట్స్ రూ.173.31 కోట్లు, పారిశుధ్య విభాగానికి రూ.261.07 కోట్లు, నిఘా- భద్రతా విభాగానికి రూ.149.99 కోట్లు, వైద్య విభాగానికి రూ.241.07 కోట్లు కేటాంచారు. ఆదాయం అంచనాలో శ్రీవారి హుండీ కానుకల ద్వారా రూ. 1,611 కోట్లు, ఫిక్సడ్ డిపాజిట్లపై వడ్డీ రూపంలో రూ.1,167 కోట్లు, ప్రసాదం విక్రయాల ద్వారా రూ.600 కోట్లు, కల్యాణకట్ట రసీదుల ద్వారా రూ.151.50 కోట్లు, గదులు, కల్యాణమండపం బాడుగల ద్వారా రూ.147 కోట్లు, శ్రీవారి దర్శనం, ఆర్జిత సేవ టికెట్ల విక్రయాల ద్వారా రూ.448 కోట్లు ఆదాయం సమకూరుతుందని అంచనా వేశారు.

## చంద్రబాబు నాయుడికి తృటిలో తప్పిన ప్రమాదం



**టి మీడియా, జనవరి 29, రాజమండ్రి :**

టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడికి తృటి లో ప్రమాదం తప్పింది. బాబుకు శుభాకాంక్షలు తెలిపేందుకు బొకేలతో ఒక్కసారిగా స్టేజీ మీదకు వచ్చేసిన టీడీపీ నేతలు. దీంతో అక్కడ కొద్దిగా తోపులాట చోటు చేసుకుంది. ఈ క్రమంలో చంద్రబాబు నాయుడిని టీడీపీ నేతలు

మిగతా 3లో..

# మొదలైన పార్లమెంట్ హీట్..

## ఓటరు చూపు ఎటువైపు.!



**టీ మీడియా, జనవరి 29,హైదరాబాద్ :**

తెలంగాణలో పార్లమెంటు ఎన్నికల హడావుడి మొదలైంది. ఇప్పటికే వ్యూహ ప్రతివ్యూహాలతో ముందుకు వెళ్తున్న పాలక ప్రతిపక్షాలు.. మాటల తూటాలతో పొలిటికల్ హీట్‌ను పెంచేశాయి. మొన్నటిదాకా రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ కొత్తగా రూలింగ్‌లోకి వచ్చిన కాంగ్రెస నువ్వానేనా అన్నట్టు తలపడుతుంటే కమలనాథులు సైతం యుద్ధానికి మేమూ సిద్ధమంటున్నారు. తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు ముగిసి రెండు నెలలు కాలేదు%శా% అప్పుడే పార్లమెంటు ఎన్నికల రచ్చ మొదలైంది. బస్తీమే సవాల్ అంటున్నాయి ప్రధాన పార్టీలు. ఈ క్రమంలోనే పరస్పరం పాలక ప్రతిపక్షాలు చేసుకుంటున్న విమర్శలు%శా% రాజకీయ వేడిని రగులుస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికల ఓటమి నుంచి తేరుకునేందుకు ప్రయత్నిస్తున్న బీఆర్ఎస్ పార్లమెంటు పోరుపై ఫోకస్ పెట్టింది. నియోజకవర్గాల వారీగా సమీక్షలు నిర్వహిస్తోంది ఆ పార్టీ అధిష్ఠానం. 24ఏళ్ల సుదీర్ఘ ప్రయాణంలో కారుకు ఇది స్వల్ప విరామమే అంటున్న కేటీఆర్.. మరింత వేగంతో పార్లమెంట్ ఎన్నిలకు దూసుకువస్తుందని.. కార్యకర్తల్లో భరోసా నింపుతున్నారు. అయితే, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ వ్యాఖ్యలకు అదే స్థాయిలో కౌంటర్ ఇస్తోంది కాంగ్రెస్. కారు షెడ్డుకు పోయిందనీ.. ఇక తిరిగి వచ్చే ప్రసక్తే లేదని ఎద్దేవా చేస్తోంది. బీఆర్ఎస్ సిట్టింగ్ ఎంపీ స్థానాల్లో భారీగా అసెంబ్లీ సెగ్మెంట్లను గెలుచుకున్న హస్తం పార్టీ.. ఇప్పుడు ఆ ఎంపీ స్థానాలపైనే గురిపెట్టింది. సరిగ్గా నడపడం చేతకాకే.. కారు బోల్తాకొట్టిందంటున్నారు కమలనాథులు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పూర్తిగా బీఆర్ఎస్ అడ్రస్ లేకుండా పోవడం ఖాయమంటున్నారు. పదికి పైగా స్థానాల్లో గెలుపే లక్ష్యంగా పనిచేస్తున్న కాషాయనేతలు ఆ దిశగా భారీ వ్యూహరచనే చేస్తున్నారు. అటు హస్తం.. ఇటు కమలం.. మధ్యలో కారు అన్నట్టుగా మారింది తెలంగాణలో రాజకీయ పరిస్థితి. మరి వచ్చే ఎన్నికల్లో జరగబోయేది ద్విముఖ పోరా? త్రిముఖ పోరా? అన్నదే తెలియాల్సి ఉంది. అసెంబ్లీలో మార్పు కోరుకున్న తెలంగాణ ఓటరు పార్లమెంటు ఎన్నికల్లో ఎటువైపు మొగ్గుచూపుతాడనేది ఆసక్తి రేపుతోంది.




## రాజ్యసభ ఎన్నికల షెడ్యూల్ విడుదల

**టీ మీడియా, జనవరి 29, న్యూఢిల్లీ :**

రాజ్యసభ స్థానాలకు ఎన్నికల కమిషన్ సోమవారం షెడ్యూల్ విడుదల చేసింది. మొత్తం 15 రాష్ట్రాలకు చెందిన 56 మంది సభ్యులకు ఎంపికకు షెడ్యూల్ ఖరారు చేసింది. ఫిబ్రవరి 8న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. ఫిబ్రవరి 15వ తేదీన నామినేషన్లకు దాఖలు చేయాల్సి ఉంటుంది. ఫిబ్రవరి 16న నామినేషన్ల పరిశీలన పూర్తి చేయనుంది. నామినేషన్ల ఉపసంహరణకు చివరితేది ఫిబ్రవరి 20. ఫిబ్రవరి 27న పోలింగ్ నిర్వహించగా.. అదే రోజు సాయంత్రం 5 గంటలకు కౌంటింగ్ జరగనున్నట్లు ప్రకటించింది. ఉత్తరప్రదేశ్‌లో పది స్థానాలకు, బీహార్ 6, మహారాష్ట్రలో 6, పశ్చిమబెంగాల్, మధ్యప్రదేశ్‌లలో ఐదేసి స్థానాల చొప్పున, గుజరాత్, కర్ణాటకల్లో నాలుగేసి స్థానాల చొప్పున, ఒడిస్సా, రాజస్థాన్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో మూడేసి స్థానాల చొప్పున, హర్యానా, ఛత్తీస్‌గఢ్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లలో ఒక్కో రాజ్యసభ స్థానానికి పోలింగ్ జరగనుంది.

## రైతులను చెప్పుతో కొడతామంటున్న కాంగ్రెస్‌ను ఓటుతో కొడదాం

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**టీ మీడియా, జనవరి 29, హైదరాబాద్:**

పదేండ్లు కమిట్‌మెంట్‌తో పనిచేశామని.. అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా సర్కారును నడిపించామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో మూడోవంతు సీట్లను ఇచ్చి బలమైన ప్రతిపక్షంగా పనిచేయమని ప్రజలు బీఆర్ఎస్‌ను ఆదేశించారని చెప్పారు. చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశానికి

మిగతా 3 లో

# బీఆర్ఎస్‌కు కొత్త టెన్షన్..


• సీఎంతో ఎమ్మెల్యేల భేటీపై గులాబీ వర్గాల్లో గుబులు..!

**టి మీడియా, జనవరి 29, హైదరాబాద్ :**

తెలంగాణలో ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్‌కు కొత్త టెన్షన్ మొదలైంది. ఓవైపు సీఎం రేవంత్‌రెడ్డి గులాబీ పార్టీపై రాజకీయంగా తీవ్ర విమర్శలు చేస్తుండటం.. మరోవైపు ఆ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు తరచూ ముఖ్యమంత్రితో సమావేశం కావడం చర్చనీయాంశంగా మారుతోంది. తాజాగా.. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ కూడా రేవంత్‌రెడ్డితో ప్రత్యేకంగా భేటీ కావడం గులాబీ వర్గాల్లో గుబులు రేపుతోంది.

**బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై హస్తం పార్టీ ఫోకస్ :**

అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం రాష్ట్రంలో రాజకీయాలు వేగంగా మారుతున్నాయి. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు తర్వాత రెండు దఫాలు అధికారంలో ఉన్న బీఆర్ఎస్.. ఇప్పుడు ప్రధాన ప్రతిపక్షంగా మారింది. అయితే.. 2014, 2018 ఎన్నికల తర్వాత గులాబీ పార్టీ అనుసరించిన విధానాలనే.. ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి కూడా అనుసరిస్తారా అన్న చర్చ సాగుతోంది.పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై హస్తం పార్టీ ఫోకస్ పెట్టిందన్న ప్రచారం నడుస్తోంది. గులాబీ పార్టీపై ఆధిపత్యం చెలాయించాలంటే.. నియోజకవర్గాల్లోని బలమైన నేతలను తమ పార్టీలో చేర్చుకునేందుకు రేవంత్‌రెడ్డి స్వయంగా పావులు కదుపుతున్నారా అన్న చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది.



**కాంగ్రెస్‌లో చేరుతున్నారంటూ జోరుగా ప్రచారం :**

కొద్ది రోజుల క్రితం మెదక్ జిల్లాకు చెందిన నలుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సీఎం రేవంత్‌రెడ్డిని కలుసుకున్నారు. అయితే.. వారంతా కాంగ్రెస్‌లో చేరుతారన్న చర్చ జోరందుకోవడంతో.. కేవలం నియోజకవర్గాల అభివృద్ధిపై చర్చించేందుకే కలిశామని వివరణ ఇచ్చుకున్నారు. అంతకుముందే.. మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్ ఓ కార్యక్రమంలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్.. స్వామిగౌడ్‌తో పాటు ప్రకాశ్‌గౌడ్ ఇంటికి కూడా వెళ్లి భేటీ అయ్యారు. దీంతో వారిద్దరూ కాంగ్రెస్‌లో చేరుతారనే ప్రచారం జరిగింది.

**రేవంత్‌తో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు భేటీ:**

రెండ్రోజుల క్రితం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి సైతం సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ అయ్యారు. ఎన్నికల ముందే ఆయన పార్టీ మారుతారన్న ప్రచారం జరిగినా.. అది సాధ్యం కాలేదు. తాజా భేటీతో కృష్ణారెడ్డి హస్తం పార్టీలో చేరిపోనున్నారనే వార్తలకు బలం చేకూరింది. ఇదిలా ఉండగా.. ఆదివారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. దాదాపు 45 నిమిషాల పాటు ఆయనతో ఏకాంతంగా చర్చించినట్లు తెలుస్తోంది. అయితే.. ప్రకాశ్‌గౌడ్ కూడా నియోజకవర్గ అభివృద్ధి పనుల గురించి మాత్రమే సీఎంను కలిశానని.. పార్టీ మారే ఆలోచన తనకు లేదని ప్రకటించారు.

పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో బీఆర్ఎస్‌కు చెందిన ఎమ్మెల్యేలు సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ కావడం చర్చనీయాంశంగా మారింది. ఓవైపు అవిశ్వాసాలతో మున్సిపాలిటీలు హస్తగతం కావడం.. మరోవైపు బీఆర్ఎస్ నేతల వరుస భేటీలతో బీఆర్ఎస్ కార్యకర్తల్లో కొత్త టెన్షన్ మొదలైంది.

## డ్రగ్స్ కేసులో టాలీవుడ్ హీరో ప్రియురాలు అరెస్ట్

**టీ మీడియా, జనవరి 29,హైదరాబాద్ :**



శివారులోని నార్సింగిలో మరోసారి డ్రగ్స్ కలకలం రేపాయి. లావణ్య అనే యువతి నుంచి 4 గ్రాముల ఎం డిఎం ఎ ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆమెను అదుపులోకి తీసుకుని విచారించగా.. లావణ్య టాలీవుడ్‌కి చెందిన ఓ హీరో ప్రియురాలిగా తేలింది. సినీ ఇండస్ట్రీలో అనేక మందితో ఆమెకు పరిచయాలు ఉన్నట్లు అనుమానిస్తున్నారు. ప్రస్తుతం ఆమెకున్న లింకులపై కూపీలాగే ప్రయత్నం చేస్తున్నారు. ఇంతకీ ఆమె ఏ హీరో ప్రియురాలో తేల్చేపనిలో ఉన్నారు పోలీసులు.గోవా నుంచి డ్రగ్స్ తీసుకొచ్చి నగరంలో విక్రయిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఆమెపై ఎన్ డి పి ఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. ఇప్పటికే మోకిల పీఎస్ డ్రగ్స్ కేసులో లావణ్య నిందితురాలిగా ఉంది. ప్రస్తుతం లావణ్యను రిమాండ్‌కు తరలించారు.తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి డ్రగ్స్ నివారణపై ఫోకస్ పెంచారు. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో డ్రగ్స్ ఫ్రీ తెలంగాణగా తీర్చిదిద్దేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఎక్కడికక్కడ విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు. డ్రగ్స్ విక్రయిస్తూ ఎవరైనా పట్టుబడితే కఠినచర్యలు తీసుకుంటామని ఇప్పటికే రేవంత్ రెడ్డి స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. ఈ కేసులో ఎవరెవరి హస్తం ఉందో విచారణలో ఏ తేలుస్తారో అన్నది ఆసక్తిగా మారింది.



## పెండింగ్ స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ ని విడుదల చేయాలి

• ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆర్ల సందీప్

**టీ మీడియా, జనవరి 29, పెద్దపల్లి :**

రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పెద్దపల్లి ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ కార్యాలయం లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కి వినతి పత్రాన్ని అందజేశారు . ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆర్ల సందీప్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్ స్కాలర్షిప్ లను వెంటనే విడుదల చేయాలని పెరిగిన ధరలకు అనుగుణంగా మిస్ కాస్మోటిక్ చార్జీలు పెంచాలి, అలాగే ఇప్పటివరకు పెండింగ్ లో ఉన్న మెస్ కాస్మోటిక్ బిల్లులను విడుదల చేయాలని జిల్లా కేంద్రంలో ఎస్సీ ( ఎస్ఎం హెచ్) బాలికల కళాశాల హాస్టల్ ను బాలికలకు ఏర్పాటు చేయాలని. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలకు పక్కా భవనం నిర్మించాలి.జిల్లా కేంద్రంలో ఉన్నటువంటి గురుకుల హాస్టల్స్ అన్నీ కూడా అద్దె భవనాలలో కొనసాగుతున్నాయి వాటికి వెంటనే పక్కా భవనాలు నిర్మించాలని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలని అన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వెల్ఫేర్ హాస్టల్స్ మరియు గురుకులాల్లో ఏఎన్ఎం లను నియమించాలని వెంటనే రాష్ట్ర ప్రభుత్వం సమస్యలను పరిష్కరించాలని అని లేనియెడల ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సిద్ధార్థ, నిఖిల్, శ్రావణ్, అజయ్, భరత్, తదితరులు పాల్గొన్నారు.




## ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన కార్యక్రమం

**టీ మీడియా, జనవరి 29, పెద్దపల్లి :**

పెద్దపల్లి పట్టణంలోని గాయత్రి డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో రోడ్ సేఫ్టీ మంత్ సెలబ్రేషన్సలో భాగంగా విద్యార్థిని విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రామగుండం ట్రాఫిక్ ఏసిపి నర్సింహులు మాట్లాడుతూ 2022 సంవత్సరంలో రోడ్డు ప్రమాదాలలో 1 లక్ష 68 వేల మంది చనిపోతే అందులో 85 శాతం యూత్ ఉన్నారని తెలిపారు. తాగి డ్రైవింగ్ చేయడం, ఓవర్ లోడ్, ఓవర్ టేక్ తదితర కారణాలతో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని అన్నారు. ప్రతి ఒక్కరు ట్రాఫిక్ రూల్స్ పాటిస్తే రోడ్డు ప్రమాదాలు జరగవని అన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ దత్తు ప్రసాద్, గాయత్రి విద్యాసంస్థల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్, ప్రిన్సిపాల్. రవీందర్, ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎంఏ . సమద్, అధ్యాపక బృందం, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## పాలక మండలి చైర్మన్ పై పెట్టిన అవిశ్వాస తీర్మానం విజయం

**టీ మీడియా, జనవరి 29, పెద్దపల్లి :**



పెద్దపల్లి మండలం అప్పన్నపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పాలకమండలి చైర్మన్ పై పెట్టిన అవిశ్వాస తీర్మానం విజయం అయిందని13 మంది సభ్యులు కలిగిన పాలకమండలిలో చైర్మన్ దాసరి చంద్రారెడ్డి పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా 11 మంది సభ్యులు ఓటేశారు. ఉపాధ్యక్షుడు చింతపండు సంపత్ ను తాత్కాలిక చైర్మన్గా నియమించినట్లు జిల్లా సహకార అధికారి శ్రీ మాల తెలిపారు.

## వాణిజ్య పంటలతో రైతులకు అధిక లాభాలు

• మండల వ్యవసాయ శాఖ అధికారి బి నాగేశ్వర్ రెడ్డి

**టీ మీడియా, జనవరి 29, మహానంది:**



వాణిజ్య పంటల సాగుతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని మహానంది మండల వ్యవసాయ అధికారి బి నాగేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మహానంది మండలంలోని గోపవరం రెవిన్యూ గ్రామ పరిధిలోని ఎం సి ఫారం సమీపంలో జి. పృథ్వి రాజకుమార్ రెడ్డి ఆరు ఎకరాలలో సాగు చేస్తున్న పొగాకు పంటను సందర్శించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ శాఖ అధికారి బి నాగేశ్వర్ రెడ్డిమాట్లాడుతూ పొగాకు సాగుతో ఎకరానికి దిగుబడి 15 క్వింటాలకు పైగా వచ్చే అవకాశం ఉన్నదని, ఇప్పుడున్న మార్కెట్ ధర ప్రకారం సాగు ఖర్చుపోగా, ఎకరాకు లక్ష అరవై వేలు రూపాయలు పైనే మిగిలే అవకాశం ఉందన్నారు. మండలంలో ఈ రబీ సీజన్లో వాణిజ్య పంట అయిన పొగాకు పంటను రైతులు, 100 ఎకరాలకు పైగా సాగు చేస్తున్నారని తెలిపారు. వివిధ గ్రామాలలో రైతులు పొగాకు పంటను సాగు చేస్తున్నాలని,పొగాకు పంటలో దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయని, మార్కెట్ రేటు కూడా ఆశాజనకంగా ఉండడంతో, రైతులకు ఎక్కువ ఆదాయం వచ్చే అవకాశాలు ఉన్నాయని. 10 నుండి 12 క్వింటాళ్లు దిగుబడి వచ్చే అవకాశం ఉన్నదని. రైతులు రబీ సీజన్లో, వరి పంటలు కాకుండా, వాణిజ్య పంటలు సాగు చేస్తే మంచి ఫలితాలు పొందవచ్చని,రైతులు ఇలాంటి ఆదాయం వచ్చే వాణిజ్య పంటలను సాగు చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విహెచ్ఏ హరిత, ఎంపీఈఓ ఇంద్రాణి,రైతులు పాల్గొన్నారు.

## టాలీవుడ్ నటుడు వేణు ఇంట తీవ్ర విషాదం

• తండ్రి ప్రొఫెసర్ వెంకట సుబ్బారావుకన్నుమూత

**టి మీడియా, జనవరి 29, హైదరాబాద్:**



ప్రముఖ టాలీవుడ్ నటుడు వేణు ఇంతా విషాదం నెలకొంది. వేణు తండ్రి, లోక్ సభ లొ బి ఆర్ ఎస్ పక్ష నేత ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వర రావు మామ గారు ప్రొఫీసర్ వెంకట సుబ్బారావు కన్నుమూశారు. నటుడు వేణు తండ్రి ప్రొఫెసర్ వెంకట సుబ్బారావు (92) వృద్ధాప్య సమస్యల కారణంగా కన్నుమూశారు. జనవరి 29న తెల్లవారుజామున వేణు తండ్రి కన్నుమూశారు. దాంతో వేణు కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ప్రొఫెసర్ వెంకట సుబ్బారావు కన్నుమూయడంతో పలువురు సినీ ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. అలాగే ప్రొఫెసర్ వెంకట సుబ్బారావు మృతికి సంతాపం వ్యక్తం చేస్తున్నారు. నేటి మధ్యాహ్నం ప్రొఫెసర్ వెంకట సుబ్బారావు అంత్యక్రియలు జూబ్లీహిల్స్ లోని మహాప్రస్థానంలో జరగనున్నాయి.వేణు హీరోగా కెరీర్ ప్రారంభించి మంచి విజయాలను అందుకున్నారు. చాలా సినిమాల్లో హీరోగా నటించిన వేణు ఊహించని విధంగా సినిమాలకు గ్యాప్ ఇచ్చారు. ఆతర్వాత దమ్ము , రవితేజ రావణాసుర సినిమాల్లో కీలక పాత్రల్లో నటించాడు వేణు. ఇటీవలే అతిథి అనే వెబ్ సిరీస్ లో నటించారు వేణు . ఈ వెబ్ సిరీస్ డిస్నీ హాట్ స్టార్ లో స్ట్రీమింగ్ అవుతుంది.

## ముషీరాబాద్ గాంధీనగర్‌లో ఇళ్ల కూల్చివేత.. ఉద్రిక్తత

**టి మీడియా, జనవరి 29, ముషీరాబాద్:**



ముషీరాబాద్‌లోని గాంధీనగర్ వివేకానంద నగర్‌లో ఉద్రిక్తత నెలకొంది. రెవెన్యూ అధికారులు ఇళ్ల కూల్చివేతలను చేపట్టారు. బస్తీలోనికి ఎవ్వరిని అనుమతించకుండా భారీ బందోబస్తు మధ్య అధికారులు కూల్చివేతలను ప్రారంభించారు. అక్రమంగా ఇళ్ల నిర్మాణాలు చేయడంతో కూల్చివేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ క్రమంలో స్థానికులు ఆందోళనకు దిగారు. ప్రస్తుతం అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. 23 కుటుంబాలు గత 70 సంవత్సరాలుగా అక్కడ నివాసం ఉంటున్నట్లు స్థానికులు చెబుతున్నారు. స్థలం వివాదం కేసు హైకోర్టులో పెండింగ్‌లో ఉందన్నారు. వచ్చే నెల 6వ తేదీన కేసు విచారణకు రానుందని, అయినప్పటికీ అధికారులు ఇళ్లను కూల్చివేస్తున్నారని బస్తీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారుకాగా.. రోడ్డు, ప్రభుత్వ భూమిలో అక్రమంగా నివాసం ఉంటున్న వారి ఇళ్లను అధికారులు తొలగిస్తున్నారు. కోర్టులో ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు రావడంతో చర్యలు చేపట్టారు. 2000 సంవత్సరం నుండి వివిధ రూపాల్లో కూల్చివేతలను స్థానికులను అడ్డుకుంటున్నారు. అక్రమ నిర్మాణాలు తొలగించాలంటూ జీహెచ్ఎంసీ, రెవిన్యూ అధికారులను న్యాయస్థానం ఆదేశించింది. అయితే.. కోర్టు ఆదేశాలను పట్టించుకోవడం లేదంటూ కొందరు వ్యక్తులు కంటెంట్ ఆఫ్ కోర్టు కింద కేసు వేశారు. దీంతో అధికారులు నోటీసులు ఇచ్చి ఇళ్లను కూల్చివేస్తున్నారు.

## ముషీరాబాద్‌లో ఉద్రిక్తత...దళితుల ఇండ్లు కూల్చివేత

**టి మీడియా, జనవరి 29,ముషీరాబాద్ (తెలంగాణ) :**




హైదరాబాద్‌లోని ముషీరాబాద్‌లో జిహెచ్ఎంసి అధికారులు దళితుల ఇళ్లను కూల్చివేయడంతో స్థానికంగా ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. గాంధీనగర్ డివిజన్‌లోని స్వామి వివేకానంద నగర్‌లో కొందరు దళితులు దాదాపు 70 ఏళ్లుగా ఇళ్లను నిర్మించుకొని నివాసముంటున్నారు. సోమవారం ఉదయం ఎంఆర్ఒ, అధికారులు తమ సిబ్బందితో వచ్చి అకస్మాత్తుగా దళితుల ఇళ్లను కూల్చివేశారు. కేసు కోర్టులో పెండింగ్‌లో ఉన్నప్పటికీ అధికారులు బలవంతంగా పోలీసు బందోబస్తుతో వచ్చి ఇండ్లను కూల్చివేశారు. స్థానికులు ఆందోళనలు నిర్వహించే అవకాశం ఉండటంతో ముందస్తు భద్రతా చర్యలు చేపట్టి కూల్చివేతలను ప్రారంభించారు. బస్తీలోని స్థానికులను ఎవరిని కూడా అనుమతించడం లేదు. ధరణి విచారణ కమిటీ ఛైర్మన్ కోదండ రెడ్డి ఘటనా స్థలానికి వచ్చి బాధితులను పరామర్శిస్తున్న సమయంలో పోలీసులు ఆయన్ను నెట్టివేశారు.బాధితులు మాట్లాడుతూ %ా% మొత్తం 23 దళిత కుటుంబాలు గత 70సంవత్సరాలుగా ఇక్కడే నివాసము ఉంటున్నామని చెప్పారు. వచ్చే నెల అంటే ఫిబ్రవరి 6వ తేదీన హైకోర్టులో కేసు పెండింగ్ లో ఉన్నప్పటికీ అధికారులు తమ ఇండ్లను కూల్చివేస్తున్నారని బస్తీ వాసులు వాపోయారు. ఇళ్లలో సామాన్లు ఉన్నాయని చెబుతున్నా వినడం లేదని కంటతడిపెట్టారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ కొందరు బాధితులు పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా.. పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. భారీ పోలీసు బందోబస్తు నడుమ ఇళ్ల కూల్చివేత కొనసాగడంతో స్థానికంగా ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది.

## 10వ తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

• స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ

**టీ మీడియా, జనవరి 29, పెద్దపల్లి :**



రాబోయే 10వ తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ అన్నారు. సోమవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ జూలపల్లి మండలం పెద్దాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. గత ఏడాది 10వ తరగతి పరీక్షల్లో పెద్దాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆశించిన స్థాయిలో ఫలితాలు రాలేదని, ప్రస్తుత సంవత్సరం ప్రణాళికా బద్ధంగా విద్యా బోధన చేస్తూ మెరుగైన ఫలితాల సాధనకు కృషి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ తెలిపారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ మాట్లాడుతూ, మంచి మార్కులతో పాస్ అవ్వాలని విద్యార్థులు లక్ష్యంగా పెట్టుకోవాలని, పాఠశాలలో ఉపాధ్యాయులు అందించే సూచనలు పాటిస్తే తప్పనిసరిగా వంద శాతం ఉత్తీర్ణత సాధ్యమవుతుందని అన్నారు. 10వ తరగతిలో 12 మంది విద్యార్థులు చదువుతున్నారని, వీరు పాసయ్యే విధంగా ఉపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలని,ఉపాధ్యాయులు ప్రతిరోజు ఉదయం వేకప్ కాల్స్ చేయాలని, విద్యార్థులు ఉదయం రెండు గంటల పాటు చదువుకోవాలని, ప్రతిరోజు తప్పనిసరిగా పాఠశాలలో నిర్వహించే ప్రత్యేక తరగతులకు హాజరుకావాలని 10వ తరగతి విద్యార్థుల కోసం పాఠశాలలో సెలవు దినాలలో సైతం ప్రత్యేక తరగతులు నిర్వహించడం జరుగుతుందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ముఖ్యమైన పాఠ్యాంశాలతో కూడిన వర్క్ బుక్ లను విద్యార్థులకు పంపిణీ చేశామని, వాటిపై విద్యార్థులు సంపూర్ణ ప్రావీణ్యం కలిగి ఉండేలా ఉపాధ్యాయులు శిక్షణ అందించాలని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి సైతం 10వ తరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో చర్చించాలని, ఇంటి వద్ద విద్యార్థులు అధిక సమయం చదువుకునేలా, విద్యార్థులకు ప్రశాంత వాతావరణం కల్పించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని పాఠశాల ప్రాంగణంలో స్థలం అందుబాటులో ఉన్న నేపథ్యంలో పచ్చదనం పెంచేలా మొక్కలు నాటి వాటి సంరక్షణ చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ప్రధానోపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వేణుగోపాల రావు, మండల విద్యాశాఖ అధికారి కవిత, మండల పంచాయతీ అధికారి కిరణ్, ప్రధానోపాధ్యాయులు రాగమయి, సంబంధిత అధికారులు, విద్యార్థిని, విద్యార్థులు, తదితరులు పాల్గోన్నారు.



## రామకృష్ణ మఠం సేవలు ప్రశంసనీయం

• ఎమ్మెల్యే హరీశ్ రావు

**టీ మీడియా, జనవరి 29, సిద్దిపేట :**

అమ్మ అంటే అందరికీ చాలా ఇష్టం. అలాంటి ఆ అమ్మను మరింత బలోపేతం చేసే దిశగా రామకృష్ణ మఠం వారు ఇంత మంచి కార్యక్రమం నిర్వహించడం చాలా సంతోషమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. సిద్దిపేట విపంచి కళానిలయంలో రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన గర్భిణుల అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. తల్లి తీసుకునే ఆహారమే పుట్టబోయే బిడ్డ ఎదుగులపై ప్రభావం చూపుతుందన్నారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. గర్భిణులు శారీరక, మానసిక ఒత్తిడి కలుగకుండా ఇంట్లో, బయట మంచి వాతావరణం ఉండేలా చూసుకోవాలన్నారు. నార్మల్ డెలివరీలు జరిగేలా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం గతంలో గర్భిణులకు కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్స్ ఇచ్చి వారు ఆరోగ్యం ఉండేలా జాగ్రత్తలు తీసుకుందని గుర్తు చేశారు.



## వర్తక సంఘ నూతన కార్యవర్గం ఎన్నిక

**టీ మీడియా, జనవరి 29, జన్నారం:**

జన్నారం పట్టణ వర్తక సంఘ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల కేంద్రంలోని స్థానిక వర్తక సంఘ భవనంలో వారు సమావేశం అయ్యారు.ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆ సంఘ గౌరవ అధ్యక్షుడు మల్యాల బాపన్న ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా వజ్జల వామన్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా జక్కు రమేష్, కోశాధికారిగా కొమరవెల్లి శివరామకృష్ణ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.అనంతరం వారు మాట్లాడుతూ సంఘ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ సంఘ అభివృద్ధికి తోడ్పడతామని అన్నారు.ఈ కార్యక్రమంలో వర్తక సంఘ సభ్యులు పాల్గొన్నారు.



## సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం

• పాల్గొన్న అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ, శ్యామ్ ప్రసాద్ లాల్

**టీ మీడియా, జనవరి 29, పెద్దపల్లి :**

ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ అన్నారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్ తో కలిసి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ ప్రజల అర్జీలను స్వీకరించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ మాట్లాడుతూ, ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యత నిచ్చి ప్రజలు ఇచ్చిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి సమస్యలను సకాలంలో పరిష్కరించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ఆర్డీవో సి.హెచ్. మధుసూధన్, జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అందరికీ డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ కార్డు

(మొదటిపేజీ తరువాయి...)

ఆధారపడకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలన్నారు. ఏరియాల వారీగా ఎక్కడికక్కడ వైద్య సదుపాయాలు కల్పించి ప్రజలకు మెరుగైన వైద్యం అందించేలా చూడాలన్నారు. సంబంధిత మెడికల్ కాలేజీల్లో ఆరోగ్యశ్రీ సేవలు కొనసాగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.
ఉస్మానియా ఆసుపత్రి విస్తరణలో సమస్యలను అధికారులు సీఎంకు వివరించారు. ఉస్మానియా హెరిటేజ్ భవనానికి సంబంధించి కోర్టులో ఉన్నందున, కోర్టు సూచనల ప్రకారం ఎలా ముందుకు వెళ్లాలో నిర్ణయం తీసుకుందామని సీఎం అన్నారు. మెడికల్ కాలేజీలతో అనుసంధానంగా ఉన్న ప్రభుత్వ ఆసుపత్రుల్లో హౌస్ కీపింగ్ మెయింటెనెన్స్ నిర్వహణ బాధ్యతను పెద్ద ఫార్మా కంపెనీలు తమ సిఎస్ఆర్ నిధులను ఉపయోగించి హౌస్ కీపింగ్ సేవలను మెరుగుపరచాలని అన్నారు. ఉస్మానియా, గాంధీ ఆసుపత్రులలో ఏదో ఒక ఆసుపత్రిలో దీనిని పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు.

రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ అమలు తీరు, నిధులకు సంబంధించి సీఎం అధికారులతో చర్చించారు. ప్రతి నెల ప్రభుత్వ ఆసుపత్రులకు ఆరోగ్యశ్రీ బిల్లులు విధిగా విడుదల చేయాలని అన్నారు. ప్రయివేటు ఆసుపత్రుల ఆరోగ్యశ్రీ బిల్లులను ప్రతీ మూడు నెలలకోసారి విడుదల చేసేలా ఒప్పందం కుదుర్చుకోవాలని అధికారులకు ఆదేశించారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలతో అనుసంధానంగా వున్న టీచింగ్ హాస్పిటల్స్, ప్రభుత్వ హాస్పిటల్స్ కు పెండింగ్ లో ఉన్న రూ.270 కోట్ల ఆరోగ్య శ్రీ బిల్లులు వెంటనే విడుదల చేయాలని చెప్పారు. అలాగే జూనియర్ డాక్టర్స్, ఆశ వర్కర్స్, స్టాఫ్ నర్సుల జీతాలు ప్రతి నెల క్రమం తప్పకుండ అందించేలా చూడాలన్నారు. 108,102 సేవల పనితీరును ముఖ్యమంత్రి అరా తీశారు, మెరుగైన సేవలు అందించేలా చూడాలని సీఎం ఆదేశించారు.

# అరాచకాన్ని అడ్డుకుందాం..రాష్ట్రాన్ని కాపాడుకుందాం

(మొదటిపేజీ తరువాయి...)

ప్రశ్నించాడన్నారు. మంత్రి పెద్దిరెడ్డిపై ఎందుకు విచారణ జరిపించరని సీఎం జగన్?ని చంద్రబాబు ప్రశ్నించారు. జాబ్ క్యాలెండర్ లేదు, ఉద్యోగాలు లేవు. ఊరూర ఆకుకూరలు దొరకటం లేదు కానీ, గంజాయి మాత్రం దొరుకుతోందని మండిపడ్డారు. రాష్ట్రంలో యువతను గంజాయికి అప్పగించారని ఆరోపించారు. జనసేన, తెలుగుదేశం అధికారంలోకి రావటం ఖాయమని, ఏటా నాలుగు లక్షలు చొప్పున ఐదేళ్లలో 20లక్షల మందికి ఉద్యోగాలు ఇస్తామని చంద్రబాబు అన్నారు. అప్పటి వరకూ నెలకు 3 వేలు నిరుద్యోగ భృతి చెల్లిస్తామని, ఇక వర్క్ ఎట్ హెూం విధానం అమలులోకి తీసుకువస్తామని చెప్పారు. ఇంటిలో బోర్ కొడితే మండల కేంద్రంలో పని చేసుకునే వీలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. రైతుల సమస్యలు అన్నీ ఇన్నీ కావని, ఆక్వా రైతును ఆదుకొంటామని, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని, పేదరికం లేని సమాజాన్ని సృష్టిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు జవహర్, యనమల రామకృష్ణుడు, గోరంట్ల బుచ్చయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.


# చంద్రబాబు నాయుడికి తృటిలో తప్పిన ప్రమాదం

(మొదటిపేజీ తరువాయి...)

తోసేశారు. దీంతో చంద్రబాబు నాయుడు తుళ్లి పడబోయారు. తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలో టీడీపీ ఏర్పాటు చేసిన రా కదలిరా సభలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడికి తృటి లో ప్రమాదం తప్పింది. బాబుకు శుభాకాంక్షలు తెలిపేందుకు బొకేలతో ఒక్కసారిగా స్టేజీ మీదకు వచ్చేసిన టీడీపీ నేతలు. దీంతో అక్కడ కొద్దిగా తోపులాట చోటు చేసుకుంది. ఈ క్రమంలో చంద్రబాబు నాయుడిని టీడీపీ నేతలు తోసేశారు. దీంతో చంద్రబాబు నాయుడు తుళ్లి పడబోయారు. వెంటనే అలర్ట్ అయిన ఆయన వ్యక్తిగత సిబ్బంది ఆయనను పట్టుకుని నిల్చోబెట్టారు. దీంతో సెక్యూరిటీ సిబ్బంది టీడీపీ నేతలందరినీ కిందకి దించేశారు.

# కొత్త సోలార్ పాలసీని ప్రకటించిన ఢిల్లీ సీఎం

**టీ మీడియా, జనవరి 29, న్యూఢిల్లీ:**




ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ కొత్త సోలార్ పాలసీని ప్రకటించారు. సౌర విద్యుత్తు 2024కు చెందిన విధివిధానాలను ఆయన వెల్లడించారు. ఇప్పటి వరకు 2016కు చెందిన సోలార్ పాలసీ అమలులో ఉందన్నారు. దేశంలోనే ఆ విధానం అత్యంత క్రియాశీలకమైందన్నారు. ఢిల్లీలో ఇప్పటి వరకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు ఇస్తున్నామన్నారు. 400 యూనిట్లు ఖర్చు చేసిన వారికి సగం ఛార్జీలు వసూల్ చేస్తున్నామన్నారు. ఇక 400 యూనిట్లు దాటిన వారి వద్ద నుంచి మొత్తం బిల్లును వసూల్ చేస్తున్నట్లు చెప్పారు. అయితే కొత్త సోలార్ విధానంలో .. తమ ఇండ్లపై సోలార్ ప్యానెళ్లను ఫిక్స్ చేసినవాళ్లకు అసలు కరెంటు బిల్లు ఉండదన్నారు. సోలార్ విద్యుత్తు ఫలకాలను ఇంటిపై అమర్చుకున్నవాళ్లు ఎంత విద్యుత్తును ఖర్చు చేసినా వాళ్లకు ఏమాత్రం బిల్లు ఉండబోదన్నారు. సోలార్ ప్యానెల్స్ పెట్టుకున్న వాళ్లు ప్రతి నెలా సుమారు 900 సంపాదించవచ్చు అని కూడా సీఎం కేజ్రీవాల్ తెలిపారు. 500 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉన్న ప్రభుత్వ బిల్డింగ్‌లపై మూడేళ్లలోగా సోలార్ ప్యానెళ్లను పెట్టనున్నట్లు సీఎం కేజ్రీవాల్ తెలిపారు. సోలార్ పాలసీ బిల్లుకు క్యాబినెట్ ఆమోదం దక్కిందని, పది రోజుల్లోగా నోటిఫికేషన్ వస్తుందన్నారు.

# హీరోలు వెంకటేష్-రానాలపై కేసు నమోదు

- కోర్టు కీలక ఆదేశం

**టి మీడియా, జనవరి 29, హైదరాబాద్ :**



ఫిల్మం నగర్ డెక్కన్ కిచెన్ కూల్చివేతపై సోమవారం విచారణ చేపట్టిన తెలంగాణలోని నాంపల్లి కోర్టు హీరోలు వెంకటేష్-రానాలపై కేసు నమోదుకు ఆదేశించింది. నటుడు విక్టరీ వెంకటేష్, ప్రముఖ నిర్మాత సురేష్ బాబు, ఆయన ఇద్దరు కుమారులు రానా, అభిరామ్ లపై కేసులు నమోదు చేయాలని కోర్టు కీలక ఆదేశాలిచ్చింది. నందకుమార్ అనే వ్యక్తి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో నందకుమార్ నిందితుడిగా ఉన్నారు. పోలీసుల సహకారంతో తన హెూటల్ ను కూల్చివేశారని, కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ ధిక్కరిస్తూ జేసీబీతో అక్రమ కూల్చివేతలకు పాల్పడ్డారని, ఉద్దేశపూర్వకంగా కోట్ల రూపాయల నష్టం కలిగించారని తన పిటిషన్‌లో నందకుమార్ పేర్కొన్నారు. కోట్ల విలువైన భవనాన్ని కూల్చివేయడంతో పాటు ఫర్నిచర్ ను ఎత్తుకెళ్లారని ఫిర్యాదులో తెలిపారు. దీనిపై ఈరోజు విచారణ చేపట్టిన కోర్టు.. నిర్మాత సురేష్ బాబుతో సహా దగ్గుబాటి హీరోలపై కేసులు నమోదు చేయాలంటూ పోలీసులను ఆదేశించింది. తెలంగాణ హైకోర్టు ఆదేశాల మేరకు వెంకటేశ్, రానా, అభిరామ్, సురేష్ ఐపిసి లోని 448, 452,380, 506, 120 బి సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. డెక్కన్ కిచెన్ కూల్చివేతపై అందిన ఫిర్యాదు మేరకు నాంపల్లి కోర్టు విచారణ చేపడుతోంది. ఆరోపణలు ఎదుర్కొంటున్న దగ్గుబాటి హీరోలు జూన్‌లో కూడా కోర్టు విచారణకు హాజరు కావాలని కోర్టు ఆదేశించింది.



# అఖిలపక్ష భేటీకి కేంద్రం పిలుపు

**టి మీడియా, జనవరి 29, హైదరాబాద్ :**

పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు జనవరి 31 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. మంగళవారం ఉదయం 11.30 గంటలకు సమావేశానికి రావాల్సిందిగా అన్ని పార్టీల సభాపక్ష నేతలకు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వశాఖ సమాచారం అందించింది. జనవరి 31 నుంచి ఫిబ్రవరి 9 వరకు పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు నిర్వహించనున్నారు. సార్వత్రిక ఎన్నికల ముందు నిర్వహించనున్న చివరి సమావేశాలు ఇవే. కీలక బిల్లులన్నింటికీ గత సమావేశాల్లోనే ఆమోదం తెలపడంతో ప్రభుత్వం ఓట్ ఆన్ అకౌంట్ పైనే ఎక్కువ దృష్టి పెడుతున్నట్లు సమాచారం. ఏప్రిల్-మేలో జరిగే ఎన్నికల అనంతరం ఏర్పడే కొత్త ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెడుతుంది.

# పెండింగ్‌లో ఉన్న ఆరోగ్య శ్రీ బిల్లులను వెంటనే విడుదల చేయండి

## అధికారులను ఆదేశించిన సీఎం రేవంత్



**టీ మీడియా, జనవరి 29, హైదరాబాద్:**

మెడికల్ కాలేజీ ఉన్న ప్రతీ చోట నర్సింగ్, పారా మెడికల్ కళాశాలలు ఉండేలా చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. దీనికోసం కామన్ పాలసీని తీసుకురావాలని అధికారులకు ఆదేశారు. కొడంగల్‌లో మెడికల్, నర్సింగ్ కాలేజీలను ఏర్పాటుచేయడానికి ఉన్న అవకాశాలను పరిశీలించాలని సూచించారు. బీబీనగర్ ఎయిమ్స్‌లో పూర్తిస్థాయి వైద్య సేవలు అందుబాటులోకి తీసుకు వచ్చేలా చూడాలన్నారు. సచివాలయంలో వైద్య, ఆరోగ్య శాఖపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష జరిపారు. సమావేశానికి మంత్రి దామోదర రాజ నర్సింహ, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శాంతి కుమారి, సంబంధిత శాఖ అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎయిమ్స్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే ఖమ్మం, వరంగల్, నల్లగొండ జిల్లాల ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. తద్వారా ఉస్మానియా, నిమ్స్ దవాఖానలపై భారం తగ్గుతుందని చెప్పారు. ఎయిమ్స్‌ను సందర్శించి పూర్తిస్థాయి నివేదిక అందజేయాలని ఆదేశించారు. హాస్పిటల్‌లో పూర్తిస్థాయి వైద్య సేవల కోసం అవసరమైతే తానే స్వయంగా కేంద్రమంత్రిని కలిసి వివరిస్తానని చెప్పారు. ప్రాంతాల వారీగా ఉన్న ప్రభుత్వ దవాఖానల్లో కొన్నింటిని గుర్తించి వాటికి సీఎంఆర్ఎఫ్ ఎల్వోసీ ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మెడికల్ కాలేజీలతో అనుసంధానంగా ఉన్న ప్రభుత్వ ఆసుపత్రుల్లో హౌస్ కీపింగ్ నిర్వహణ బాధ్యత పెద్ద ఫార్మా కంపెనీలకు అప్పగించాలన్నారు. నిర్వహణ ఖర్చును వారే భరించేలా చూడాలన్నారు. ఉస్మానియా, గాంధీ హాస్పిటల్స్‌లో ఏదో ఒక దవాఖానలో దీనిని పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ అమలు తీరు, నిధులకు సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలతో అనుసంధానంగా ఉన్న టీచింగ్ హాస్పిటల్స్, ప్రభుత్వ హాస్పిటల్స్‌కు పెండింగ్‌లో ఉన్న ఆరోగ్యశ్రీ బిల్లులు వెంటనే విడుదల చేయాలని ఆదేశించారు. ప్రతీ నెల 15వ తేదీలోగా ప్రభుత్వ దవాఖానలకు ఆరోగ్యశ్రీ బిల్లులు విధిగా విడుదల చేయాలన్నారు. ప్రతీ మూడు నెలలకోసారి విధిగా ప్రైవేటు హాస్పిటల్స్ ఆరోగ్యశ్రీ బిల్లులు విడుదలయ్యేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా ఉస్మానియా దవాఖాన విస్తరణలో ఉన్న సమస్యలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. మంగళవారం ఉస్మానియా హెరిటేజ్ భవనం విషయం కోర్టులో బెంచ్‌పై రానుందని తెలిపారు. అయితే న్యాయస్థానం ఆదేశాల ప్రకారం ఎలా ముందుకు వెళ్లాలనే అంశయమై ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది.

# రైతులను చెప్పుతో కొడతామంటున్న కాంగ్రెస్‌ను ఓటుతో కొడదాం

(మొదటి పేజీ తరువాయి...)

ముఖ్యఅతిథిగా కేటీఆర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మార్పు అనే పేరుతో అమాయకులైన యువతను కాంగ్రెస్ మోసం చేసిందని విమర్శించారు. ఆరున్నర లక్షల మంది ఆటో డ్రైవర్లను సర్కారు గోసపెడుతున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్రంలో ఎక్కడా 24 గంటల కరెంటు రావడం లేదని చెప్పారు.రైతుబంధు అడిగితే చెప్పుతీసి కొడతామని అంటున్నారని విమర్శించారు. రైతుభరోసా ఇచ్చామంటూ అంతర్జాతీయ వేదికలపై అబద్ధం చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. రైతులను చెప్పుతో కొడతామంటున్న కాంగ్రెస్‌ను ఓటుతో కొడదామన్నారు. అధికారంలో వచ్చిన వెంటనే రూ.2 లక్షల రుణం మాఫీ చేస్తామని రేవంత్ రెడ్డి చెప్పారని, ఇప్పటికీ అది అమలుకాలేదని చెప్పారు. రుణం తెచ్చుకున్న రైతులకు మొండి చేయి చూపించారని విమర్శించారు. డిసెంబర్ 9న రుణమాఫీ ఫైలుపై సంతకం చేస్తామని రేవంత్ చెప్పారని గుర్తుచేశారు. కల్యాణలక్ష్మి పథకంలో తులం బంగారం ఎప్పటి నుంచి ఇస్తారని ప్రశ్నించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా గవర్నర్ ప్రసంగం సామాన్య కాంగ్రెస్ కార్యకర్త ప్రసంగం కంటే హీనంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ 420 హామీలిచ్చిందని, ఆ హామీలను అమలు చేయకుంటే బట్టలిప్పి నిలబెడతామన్నారు. నోటికొచ్చిన హామీలిచ్చి ఇరుక్కుపోయారని విమర్శించారు. కాంగ్రెస్ ఐదేండ్లు అధికారం నిలుపుకుంటుందా.. లేదా వేచి చూద్దామన్నారు. పార్లమెంటు ఎన్నిల కోడ్ రాకముందే హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ బెదిరింపులకు బీఆర్ఎస్ కార్యకర్తలు భయపడొద్దని సూచించారు. ఎలాంటి కష్టం వచ్చినా తాము అండగా నిలబడతామని చెప్పారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ త్వరలో ప్రజల్లోకి వస్తారని చెప్పారు. దేశానికి, రాష్ట్రానికి బీజేపీ చేసిందేమీ లేదన్నారు. బీజేపీ వచ్చాకే మనం బొట్టు పెట్టుకోవడం నేర్చుకున్నాం అన్నట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు. ఐటీఐఆర్‌పై బండి సంజయ్ ఒక్క మాట మాట్లాడలేదని, తెలంగాణ కోసం పార్లమెంటులో మాట్లాడేది బీఆర్ఎస్ నాయకులు మాత్రమేనని స్పష్టం చేశారు.

# కృష్ణా నదిలో నీటమునిగి ముగ్గురు విద్యార్థులు మృతి

**టి మీడియా, జనవరి 29,విజయవాడ :**



సరదా కోసం ఈతకు వెళ్లిన ముగ్గురు విద్యార్థులు మృతి చెందిన సంఘటన కృష్ణా జిల్లాలో జరిగింది. విజయవాడ పటమటకు చెందిన నడుపల్లి నాగసాయి కార్తికేయ (13), కత్తి ప్రశాంత్ (13), ఓ కార్పొరేట్ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నారు. గగన్ ఇంటర్ సెకండియర్ చదువుతున్నాడు. ఈ ముగ్గురితోపాటు కానూరు సనత్‌నగర్‌కు చెందిన ఎస్‌కె.షారూక్ ఆదివారం యనమలకుదురు ప్రాంతంలో ఓ శుభకార్యానికి వెళ్లారు. అటు నుండి సరదాగా ఈత కోసమని మధ్యాహ్నం 2 గంటల సమయంలో కృష్ణా నదిలోకి వెళ్లారు. షారూక్ ఒడ్డునే కూర్చోగా మిగిలిన ముగ్గురు నదిలోకి దిగారు. ఈత కొడుతుండగా, వారు ఒక్కసారిగా గల్లంతయ్యారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు వెంటనే రెస్క్యూ టీం ద్వారా విద్యార్థుల కోసం నదిలో గాలించారు. సాయంత్రం 7 గంటల తరువాత విద్యార్థుల మృతదేహాలు లభ్యమయ్యాయి. అప్పటికే విద్యార్థులు మృతి చెందినట్లు పోలీసులు నిర్ధారించారు. దీనిపై గుంటూరు జిల్లా తాడేపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కృష్ణా నదిలో గల్లంతైన విద్యార్థులు చనిపోయారని తెలుసుకున్న తల్లిదండ్రులు సంఘటనా స్థలానికి చేరుకొని కన్నీరుమున్నీరయ్యారు. ఇప్పుడే వస్తామని చెప్పి వెళ్లారని, తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారని విలపించారు. కృష్ణానది ప్రాంతంలో తరచుగా ఇలాంటి సంఘటనలు జరగడం ప్రధానంగా విద్యార్థులు మృతి చెందడంపై స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో కూడా ఈతకు వెళ్లిన విద్యార్థులు ఇదే విధంగా మృతి చెందారు. విద్యార్థులు ఈతకు వెళ్లకుండా కృష్ణానదిలో ఊబి ఉన్న ప్రాంతంలో బందోబస్తు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

# మాజీ ఎమ్మెల్యే కొడుకు కేసులో పోలీస్ అధికారులకు ఉచ్చు

**టీ మీడియా, జనవరి 29,హైదరాబాద్ :**



మాజీ ఎమ్మెల్యే షకీల్ కొడుకు రాహిల్ కేసులో పలువురు పోలీస్ అధికారులకు ఉచ్చు బిగుస్తోంది. పరోక్షంగా షకీల్ కొడుకు దుబాయ్ వెళ్లేందుకు సహకరించడం, కేసు నుంచి తప్పించుకోవడంలో కీలక పాత్ర పోషించిన సీఐ ప్రేమ్ కుమార్, పంజాగుట్ట మాజీ సీఐ దుర్గారావ్‌పై కేసు నమోదైంది. ఈ కేసులో పోలీసులు లోతుగా దర్యాప్తు చేసి మరిన్ని ఆధారాలు సేకరిస్తున్నారు. గత నెల 23 రాత్రి మూడు గంటల సమయంలో అతివేగంగా దూసుకెళ్లిన కారు ప్రజాభవన్ వద్ద ట్రాఫిక్ డివైడర్, బారీకేడ్లను ఢీకొట్టింది. ఆ రోజు రాత్రి విధుల్లో ఉన్న పంజాగుట్ట ఇన్‌స్పెక్టర్ దుర్గారావు ఘటనాస్థలానికి వెళ్లారు. ఆ కారును బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ తనయుడు సాహిల్ నడిపినట్టు గుర్తించారు.ప్రమాద సమయంలో కారులో నలుగురు ప్రయాణిస్తున్నట్టు ధ్రువీకరించారు. కారు నడిపిన సాహిల్‌ను తన కారులో ఎక్కించుకుని పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌కు చేరారు. బ్రీత్ ఎనలైజర్‌తో నిందితులను పరీక్షించేందుకు పక్కనే ఉన్న ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అక్కడ పోలీసులు కన్నుగప్పి సాహిల్ తప్పించుకున్నాడు. నిందితుడు సాహిల్‌ను తప్పించేందుకు అప్పటి పంజాగుట్ట ఇన్‌స్పెక్టర్ దుర్గారావు పూర్తిగా సహకరించినట్టు బయటపడింది. ప్రజాభవన్, పంజాగుట్ట పోలీస్‌స్టేషన్ వద్ద సీసీటీవీ కెమెరాల ఫుటేజ్‌ను పరిశీలించిన పోలీసు ఉన్నతాధికారులు దీన్ని ధృవీకరించారు. అంతర్గత విచారణలోనూ దుర్గారావు కేసును పక్కదారి పట్టించటమే కాకుండా, నిందితులను మార్చేందుకు పలువురితో ఫోన్‌లో మంతనాలు జరిపినట్టు నిర్ధారించారు. ఆయన వద్ద స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లలో లభించిన కాల్‌డేటా ఆధారంగా బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్, బోధన్ ఇన్‌స్పెక్టర్ ప్రేమ్‌కుమార్, మరో ఇద్దరితో మాట్లాడినట్టు ఆధారాలు సేకరించారు. బోధన్ ఠాణా ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న ప్రేమ్‌కుమార్, పంజాగుట్ట ఇన్‌స్పెక్టర్ దుర్గారావు మధ్య జరిగిన ఒప్పందంతో నిందితులను తారుమారు చేసినట్టు రుజువైంది. దీంతో కేసును తారుమారు చేసేందుకు ప్రేమ్‌కుమార్ జోక్యం చేసుకున్నాడనే ఆధారాలతో అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. మరోవైపు పంజాగుట్ట మాజీ ఇన్‌స్పెక్టర్ దుర్గారావుపైన పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో దుర్గారావును అదుపులోకి తీసుకునే అవకాశం ఉంది.కాగా దుబాయ్‌లో ఉన్న ప్రధాన నిందితుడు సాహిల్, మాజీ ఎమ్మెల్యే షకీల్ కోసం ఇప్పటికే లుక్‌ఔట్ నోటీసులు జారీ చేశారు. ప్రమాదం జరిగిన రోజు పంజాగుట్ట పోలీసుల నుంచి తప్పించుకున్న సాహిల్ ముంబై చేరాడు. అక్కడి నుంచి దుబాయ్ పారిపోయాడు. అసలు నిందితుడిని తప్పించేందుకు మహారాష్ట్రకు చెందిన డ్రైవర్ అబ్దుల్ ఆసిఫ్‌ను పంజాగుట్ట ఠాణాకు పంపి కేసు నమోదు చేయించాడు. పశ్చిమ మండలం డీసీపీ విజయ్‌కుమార్ చేపట్టిన దర్యాప్తులో ఇన్‌స్పెక్టర్ ఉద్దేశపూర్వకంగా ప్రధాన నిందితుడిని మార్చి కేసును పక్కదారి పట్టించినట్టు నిర్ధారించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పంజాగుట్ట ఇన్‌స్పెక్టర్ దుర్గారావును సస్పెండ్ చేశారు. ఆయనపై ఇప్పటికే కేసు నమోదు అయ్యింది. అతడిని అదుపులోకి తీసుకునే అవకాశం ఉంది. మరోవైపు దుబాయ్ పారిపోయేందుకు సాహిల్‌కు సహకరించిన అరసబ్, సోహెల్, అసిద్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. తాజాగా నిజామాబాద్ ఇన్‌స్పెక్టర్ ప్రేమ్‌కుమార్, అబ్దుల్‌వాహె పేర్లు కూడా చేరటంతో నిందితుల సంఖ్య ఎనిమిదికి చేరింది.

# వినీతి అధికారుల సమాచారం అందించాలి

- ఎక్కడ అవినీతి జరిగిన ఏసీబీ కి సమాచారం అందించండి
- ఏసీబీ డీఎస్పీ

**వీ.వీ. రమణమూర్తి**

**టీ మీడియా, జనవరి 29, పెద్దపల్లి :**



ఆదాయానికి మించిన ఆస్తులు కలిగిన, లంచం ఇవ్వందే పని చేయమని ఇబ్బంది పెట్టే వారి సమాచారం తమకు తెలపాలని అవినీతి నిరోధక శాఖ డిఎస్పి వి.వి. రమణ మూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదాయానికి మించిన ఆస్తులు కలిగిన వారి పేర్లు నేరుగా తమ దృష్టికి తీసుకురావాలని, సమాచారం అందించిన వారి వివరాలు, పేర్లు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. ఏ అధికారి అయినా లంచం ఇవ్వందే పని చేయమని ఇబ్బంది పెడితే, వెంటనే తమకు తెలియ జేయాలని, సదరు అధికారులను ట్రాప్ చేసి కేసులు నమోదు చేస్తామన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఎక్కడ అవినీతి జరిగిన అవినీతి నిరోధక శాఖ డిఎస్పి వి.వి. రమణమూర్తి 9154388954, ఇన్స్పెక్టర్ రాము 9154388956, ఇన్స్పెక్టర్ తిరుపతి 9154388955, ఇన్స్పెక్టర్ రవీందర్ 9154388957 లను సంప్రదించాలని ఏసీబీ డిఎస్పి వీ.వీ. రమణమూర్తి ఆ ప్రకటనలో తెలిపారు.



# స్వామి అమ్మవార్ల పల్లకి సేవ

**టీ మీడియా, జనవరి 29, మహానంది:**

మహానంది క్షేత్రంలో సోమవారం రాత్రి ఆలయ వేదపండితులు పల్లకి సేవను వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకిలో కొలువుదీర్చి ఆలయ వేద పండితులు, అర్చకులు శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భక్తిశ్రద్ధలతో మేళతాళాలతో పల్లకి సేవ నిర్వహించారు.ఈ పల్లకి ఉత్సవ కార్యక్రమంలో భక్తులు పాల్గొని స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.




# పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**టీ మీడియా, జనవరి 29, పెద్దపల్లి :**

సిద్ధార్థ పాఠశాలలో2003 బి 04 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుతుకున్న విద్యార్థులు కలిసి పాఠశాల లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.ఆ విద్యా సంవత్సరంలో బోధించిన ప్రధాన ఉపాధ్యాయుడు టాంగుటూరి.రాజయ్య ,ఉపాధ్యాయుని విజయ, ఉపాధ్యాయులు కట్కూరి శంకర్,రవీందర్ రెడ్డి, కొమురయ్య, శ్రీను, తిరుపతి రెడ్డి, అశోక్, కుమార్ లను ఆత్మీయ సమ్మేళనం లో పాల్గొన్న అనంతరం పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. చదువుకున్న సమయంలో పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.పూర్వ విద్యార్థులు అందరూ ఒకే చోట కలవడం చాలా ఆనందంగా ఉందని విద్యార్థులు రాజ్ కుమార్,సంతోష్, లింగమూర్తి అభిప్రాయాలను పంచుకున్నారు.